


ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఆయన పేరు, మేనేజ్‌మెంట్‌గురు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన సూత్రాలు, మేధావుల్ని కీర్తిస్తున్నప్పుడు 'అపర చాణక్యుడు' అంటూ ఆయన ప్రస్తావన... ఎప్పుడో క్రీస్తుపూర్వం నాటి యూనివర్సిటీ ప్రొఫెసరుగారికి ఇంత గౌరవం ఎందుకు? ఆయన రాసిన 'అర్థశాస్త్రం'లో ఏముంది? ఆధునిక సమాజానికి అదెంతవరకు పనికొస్తుంది?

చుట్టూ గుట్టలకొద్దీ తాళపత్రాలు. చాలావరకు శిథిలావస్థలో ఉన్నాయి. జాగ్రత్తగా లేపనాలు పూసి మళ్లీ అరల్లో సర్దుతున్నారు శ్యామశాస్త్రి. మైసూరులోని ప్రాచ్యలిఖిత భాండాగారం ఉద్యోగిగా అది ఆయన బాధ్యత. ఓరోజు ఎందుకో శ్యామశాస్త్రి దృష్టి ఓ మూలనపడున్న తాటాకు కట్ట మీద పడింది. వాటిని కూడా శుభ్రంచేసి పెడదామని బయటికి తీశారు. ఆసక్తికొద్దీ ఒకటిరెండు పత్రాలు తిరగేశారు. ఆయనేం మామూలు మనిషి కాదు. సంస్కృత, ఆంగ్ల భాషల్లో పండితుడు. ఒక్కో తాళపత్రం చదువుతున్నకొద్దీ...ఆశ్చర్యం, ఆనందం, ఉద్వేగం!

అది సాక్షాత్తు కౌటిల్యుని అర్థశాస్త్రం.
అప్పటిదాకా పురాణాల్లో కావ్యాల్లో ఫలానా కౌటిల్యుడు ఇలా చెప్పాడనో, అలా రాశాడనో ప్రస్తావించడమే తప్పించి, పూర్తినిడివి గ్రంథం ఎక్కడా అందుబాటులో లేదు. మూలరచనను చూసి ఎవరో పండితుడు నకలు చేసుకున్నాడు. అతని వారసులకు భాష అర్థంకాకపోవడంతో గ్రంథాలయానికి అప్పగించారు. ఇక్కడ కూడా ఎవరూ దాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. జీర్ణస్థితికి చేరుకుంది. శ్యామశాస్త్రి ఆ అరుదైన గ్రంథాన్ని కళ్లకద్దుకున్నారు. చెదలు పట్టకుండా జాగ్రత్త చేశారు. శ్రద్ధగా చదివి, తేడాలుంటే సరిచేశారు. ముద్రించి వెలుగులోకి తెచ్చారు. ఆంగ్లంలోకి అనువదించి ప్రచురించారు. ఓ గొప్ప మేనేజ్‌మెంట్ గురువు గురించి పాశ్చాత్య ప్రపంచానికి తెలిసింది, అప్పుడే. మైసూరు మహారాజావారు ఏదో దేశానికి వెళ్తే 'మీరు శ్యామశాస్త్రిగారి పట్టణం నుంచి వస్తున్నారా? ' అనడిగారట. ఆ పుస్తకానికి అంత పేరొచ్చింది!
ఇది సరిగ్గా వందేళ్లనాటి సంగతి.



* * *

తక్షశిల విశ్వవిద్యాలయమంటే చదువుల కాణాచి. చదివితే అక్కడే చదవాలని విద్యార్థులు తపించేవారు. అందులోనూ మహాగురువు చాణక్యుని దగ్గర శిష్యరికం చేయడానికి దేశదేశాల విద్యార్థులు వరుసలు కట్టేవారు. ఆయన అసలుపేరు విష్ణుగుప్తుడు. చణకుడి తనయుడు కాబట్టి చాణక్యుడయ్యాడు. గోత్రనామంతో కౌటిల్యుడిగా ప్రసిద్ధుడయ్యాడు. రాజనీతి, దండనీతి, అర్థశాస్త్రం...చాణక్యుడు ఏ పాఠం చెప్పినా కళ్లకు కట్టినట్టు ఉండేది.

సరిగ్గా ఆ సమయానికే గ్రీకుల దండయాత్ర వూపందుకుంది. అపారమైన బలగాలతో అలెగ్జాండరు దూసుకొస్తున్నాడు. తిరగబడే శక్తి తక్షశిలకు లేదు. ఆమాటకొస్తే, చుట్టుపక్కల రాజ్యాల్లో దేనికీ లేదు. ఒక్కటై నిలిస్తే తప్ప, శత్రువును నిలువరించలేని పరిస్థితి. అంత ఐకమత్యం పాలకుల్లో ఎక్కడుంది? అప్పటిదాకా మనం, మనదేశం అన్న భావనే బలపడలేదు. 'ఆర్యావర్తం' అన్న మాటతో జాతీయ భావనకు పునాదులు వేసిన మొట్టమొదటి వ్యక్తి కౌటిల్యుడే. విశ్వవిద్యాలయాలు పాఠాలకూ పరిశోధనలకూ మాత్రమే పరిమితం కాదు. సమాజంలో ఓ భాగం. సామా

జిక సమస్యల మీదా దృష్టిసారించాలి. అవసరమైతే సమస్య పరిష్కారానికి నడుంబిగించాలి... అన్నది చాణక్యుని ఆలోచన. అందుకే, గ్రీకుల దాడిని తిప్పికొట్టగల బలమైన రాజ్యవ్యవస్థను నిర్మించడానికి ఏరికోరి ఎంచుకున్న విద్యార్థి బృందంతో బయల్దేరాడు. అందులో చంద్రగుప్తుడు కూడా ఉన్నాడు. అతని నేపథ్యం గురించి అనేకానేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒకటిమాత్రం నిజం...మట్టిలోపడున్న ఆ మాణిక్యాన్ని వెలికితీసి, సానబట్టి, చరిత్రకెక్కించిన ఘనత చాణక్యుడిదే. నందవంశ నిర్మూలన, యవనుల అణచివేత, మహాసామ్రాజ్య స్థాపన... గురువు ఏ లక్ష్యాన్ని నిర్దేశించినా చంద్రగుప్తుడు శిరసావహించాడు. ఆ మహత్కార్య సాధనలో తనకొచ్చిన ఆలోచనలు, రూపొందించిన సిద్ధాంతాలు, అమలు చేసిన వ్యూహాలు, ఎదురైన అనుభవాలు, నేర్చుకున్న పాఠాలు...అన్నింటినీ సూత్రీకరించి గ్రంథస్థం చేశాడు కౌటిల్యుడు.

అదే 'అర్థశాస్త్రం'.

ఇది క్రీస్తుపూర్వం 325 నాటి సంగతి!



* * *

శతాబ్దాలనాటి అర్థశాస్త్రం సమకాలీన సమాజానికి ఏమేరకు ఉపయోగపడుతుంది? బూజు దులిపి మరీ చదవాల్సిన అవసరం ఉందా? ఎందుకిన్ని అనువాదాలు? ఎందుకిన్ని అధ్యయనాలు? అసలీ గ్రంథంలో ఏం ఉంది?

చంద్రగుప్తమౌర్యుడు, బిందుసారుడు, అశోకుడు, శాతవాహనుడు, శివాజీ...అనేకానేక పాలకులు బలమైన

సామ్రాజ్యాల్ని నిర్మించుకోడానికి, వాటిని విస్తరించుకోడానికి, సమర్థంగా పాలించుకోడానికి ఉపకరించిన సూత్రాలే... ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులైన ప్రధానమంత్రులకూ ముఖ్యమంత్రులకూ ఐఏఎస్ బాబులకూ ఐపీఎస్ బాసులకూ ఉపయోగపడతాయి. కార్పొరేట్ వ్యూహాల తయారీలో సాయపడతాయి.

సూత్రం ఒకటే. ప్రయోగమే పరిస్థితిని బట్టి మారుతుంది. అర్థశాస్త్రంలో ఆరువేల సూత్రాలున్నాయి. నూటయాభై అధ్యాయాలున్నాయి. నూటఎనభై విభాగాలున్నాయి. పేరుకు అర్థశాస్త్రమే అయినా ... డబ్బు గురించి మాత్రమే చర్చించలేదు. డబ్బు ప్రాధాన్యాన్ని వివరిస్తూనే దండనీతి, విదేశనీతి తదితర అంశాల్ని బోధించాడు. మరో పుస్తకం 'చాణక్య నీతి'లో మాత్రం రాజనీతి కంటే, నీతిబోధకే ప్రాధాన్యం ఇచ్చాడు. గత బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ ఉటంకించిన మాటలు అర్థశాస్త్రం సమకాలీనతకు అద్దంపడతాయి... 'ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో నాకు అందరికంటే ముందు కౌటిల్యుడే గుర్తుకొచ్చాడు. ప్రస్తుతమున్న సమస్యల్నే కాదు, రానున్న సమస్యల్ని కూడా పాలకులు హించాలి. వాటిని తట్టుకోడానికి సిద్ధపడాలని ఆ మేధావి చేసిన ఉపదేశమే మనకు శిరోధార్యం'.

అర్థశాస్త్రానికీ మిగిలిన శాస్త్రాలకూ తేడా అదే! ఇందులోని ప్రతిసూత్రం కౌటిల్యుని అనుభవసారమే. ఆచరణ ద్వారా నిరూపితమైనదే. 'అర్థశాస్త్రం మనిషి ఆలోచనలకు సంబంధించిన గ్రంథం. యుగాలు మారినా తరాలు మారినా ప్రాథమికంగా మనిషి ఆలోచనావిధానం మారదు. కాబట్టే, ఈ గ్రంథం కాలదోషం పట్టే అవకాశమే లేదు' అంటారు కౌటిల్యం మీద లోతైన పరిశోధనచేసిన రాధాకృష్ణ పిళ్లై. వేల సంవత్సరాల నాటి ఆ సూత్రాలు నేటి పాలకులకు చెవి మెలేసి మరీ కర్తవ్యాన్ని బోధించినట్టు ఉంటాయి. కార్పొరేట్ లీడర్లకు 'క్రైసిస్ మేనేజ్‌మెంట్' పాఠాల్లా పనికొస్తాయి. ఆర్థిక నిపుణులకు ఇది విత్తశాస్త్రం, రాజకీయవేత్తలకు రాజనీతి శాస్త్రం, దౌత్యవేత్తలకు విదేశాంగవిధాన గ్రంథం, సైనికాధికారులకు యుద్ధతంత్ర వాచకం. ఒకటేమిటి, సమాజంలో ఉన్నవీ సమాజానికి అవసరమైనవన్నీ అర్థశాస్త్రంలో ఉన్నాయి. వ్యక్తివికాసానికీ వ్యవస్థ పటిష్ఠానికీ దోహదపడే పరిజ్ఞానమంతా ఇందులో ఉంది. కౌటిల్యుని రచనల్లో ఎక్కడా కథలూ కల్పనలూ ఉండవు. ముందుమాటలో మినహాయించి, వ్యక్తిగత వివరాలు కూడా లేవు. మౌర్యసామ్రాజ్యం గురించి కానీ, చంద్రగుప్తమౌర్యుని పాలన గురించి కానీ అసలు ప్రస్తావనే లేదు. ఏ రచయిత అయినా తన గ్రంథాన్ని ఇష్టదేవతాస్తుతితో ప్రారంభిస్తాడు. కౌటిల్యుడు మాత్రం 'ఓం నమః శుక్రబృహస్పతిభ్యాం' అని మొదలుపెట్టాడు. దేవతల గురువు బృహస్పతి. రాక్షసుల గురువు శుక్రాచార్యుడు. ఒకరు మంచికి ప్రతినిధి. ఒకరు చెడుకు ప్రతినిధి. యుద్ధమంటే రణభూమిలో మాత్రమే కాదు....మనలోనూ, మనసులోనూ జరుగుతుంది. మంచీచెడూ ఢీకొంటాయి. మనిషిలోని విరుద్ధ స్వభావాలకు ఆ గురువులిద్దరూ ప్రతీకలు. అంతిమంగా మంచిని గెలిపించడమే గ్రంథకర్త లక్ష్యం.

*సరైన నాయకుడు...*

తండ్రి ఎలా ఉండాలో, బిడ్డ ఎలా ఉండాలో, భర్త ఎలా ఉండాలో, తోబుట్టువు ఎలా ఉండాలో తెలుసుకోవాలంటే రామాయణం చదవమంటారు. నాయకుడంటే ఎలా ఉండాలన్నది మాత్రం అర్థశాస్త్రం చదివితేనే అర్థమవుతుంది. చాణక్యుడి ఆదర్శనాయకుడు ఓ దేశానికి ప్రధానమంత్రి అయితే ఆ దేశం సుభిక్షం అవుతుంది. ఓ కార్పొరేట్ సంస్థకు మేనేజింగ్ డైరెక్టరు అయితే, అది ప్రపంచ స్థాయిలో నంబర్‌వన్‌గా నిలుస్తుంది. ఓ కుటుంబానికి పెద్ద అయితే ఇంటిల్లిపాదీ సంతోషంగా ఉంటారు. అతను వ్యసనాలకూ రాగద్వేషాలకూ అతీతుడు. విలువలకు విలువనిచ్చే వ్యక్తి. సమర్థతకు పట్టంకట్టే సహృదయుడు. యుద్ధతంత్ర నిపుణుడు.

నాయకుడు కష్టపడి పనిచేయాలి. ఉద్యోగులతోనూ చేయించాలి. అతనే ఎక్కడో బద్ధకంగా కునుకుతీస్తూ కూర్చుంటే, ఇక చెప్పేదేముంది? 'నాయకుడు సోమరి అయితే, అనుచరులూ సోమరులే అవుతారు. పాలన గాడితప్పుతుంది. లక్ష్యాలు పక్కదారిపడతాయి' అని హెచ్చరిస్తాడు కౌటిల్యుడు. మానవ వనరుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలంటాడు. 'యోయస్మిన్ కర్మణి కుశలః తం తస్మిన్నేవ నియోజయేత్'...అంటే, ఎవరు ఏ రంగంలో నిపుణులో ఆ రంగంలోని వారినే కీలకస్థానాల్లో నియమించాలని అర్థం. పదవుల పంపకాల్లో వర్గాలూ బంధుత్వాలూ కీలకపాత్ర పోషిస్తే ఏం జరుగుతుందో మనం చూస్తూనే ఉన్నాం. అద్దాల ఛాంబరుకో అంతెత్తుగోడల సచివాలయానికో పరిమిత మైతే ఏ నాయకుడూ ప్రజాభిమానాన్ని పొందలేడు. 'సుదర్శనో హి రాజానః ప్రజారంజయన్తి'... నిత్యం ప్రజలకు కని పించేవాడే నిజమైన నాయకుడు. జనం కూడా అలాంటివారివైపే మొగ్గుచూపుతారు. 'మీడియా మేనేజ్‌మెంట్' అవస రాన్ని నొక్కిచెప్పాడిక్కడ.

నాయకుడికి ఉండకూడని లక్షణాల్లో వ్యసనం మొదటిది. వ్యసనపరుడు ఎంత సమర్థుడైనా ఎన్ని విజయాలు సాధిం చినా...అంతిమంగా ఘోర అవమానాలు భరించాల్సి వస్తుంది. వ్యసనాల వల్ల పదవుల్ని కోల్పోయిన నాయకులు న్నారు. ధన వ్యామోహంతో వ్యాపార సామ్రాజ్యాల్ని కుప్పకూల్చుకున్న కార్పొరేట్ లీడర్లున్నారు.

నాయకుడి వ్యక్తిత్వానికి చాలా ప్రాధాన్యం ఇచ్చాడు కౌటిల్యుడు. వ్యక్తిత్వం లేని నేత తననుతాను బాగుచేసుకోలేడు, సమాజాన్నీ బాగుచేయలేడని ఆయన అభిప్రాయం. దురదృష్టం ఏమిటంటే, మన పాలకుల్లో నూటికి తొంభైమంది అలాంటివారే!

*ఆదర్శ ప్రభుత్వం*

చట్టసభలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎలా ఉండాలనే విషయంలో చాణక్యుడు స్పష్టమైన వివరణలిచ్చాడు. పాలన చక్రానికి పాలకుడు, మంత్రిమండలి ఇరుచక్రాల్లాంటివారు. ఏ చక్రం బలహీనంగా ఉన్నా... బండి ముందుకె ళ్లలేదు. 'ప్రతిపక్షం అంటే ఎక్కడో ఉండదయ్యా! నీకు నువ్వే ప్రతిపక్షం. ఏ నిర్ణయం తీసుకునే ముందైనా ఒక్కసారి అటువైపు నుంచి కూడా ఆలోచించు' అని సలహా ఇస్తాడు. ఎంత గొప్పమాట! మన పాలకులు ఈ సూత్రానికి కట్టు బడి ఉంటే, ఇన్ని కుంభకోణాలు జరిగేవా? చట్టసభలో ఏదైనా అంశం మీద చర్చ జరుగుతున్నప్పుడు సభ్యులంతా సావధానంగా వినాలట! మైకులు విరగ్గొడుతున్నవారికీ బూతులు అందుకుంటున్నవారికీ ఈ నీతులు తలకెక్కు తాయా?

పన్నుల వ్యవస్థను పండ్లతోటతో పోల్చాడు కౌటిల్యుడు. కసుగాయల్ని కోయడం వల్ల రైతుకు నష్టం, పంటకూ నష్టమే. చెల్లించే స్థోమత ఉన్న ధనవంతుల మీదే మరిన్ని పన్నులు విధించాలని విత్తనిపుణులకు సలహా ఇచ్చాడు. వివిధ కారణాలతో దేశంలో నివసిస్తున్న విదేశీయుల మీద ఓ కన్నేసి ఉంచాలని సూచిస్తాడు. మన ప్రభుత్వం ఐఎ స్ఐ తదితర ఉగ్రవాద సంస్థల ఆగడాలను అరికట్టలేకపోవడానికి ప్రధాన కారణం ఇదే.

దేశప్రజలంతా నిద్రపోతున్నా...దండం మాత్రం మేల్కొనే ఉంటుంది. ఏ దేశంలో అయితే శిక్షాస్మృతి కఠినంగా, లోప రహితంగా ఉంటుందో...ఆ దేశంలో శాంతిభద్రతలు నియంత్రణలో ఉంటాయని చెబుతాడు. సాక్షాత్తు పార్లమెంటు మీద దాడిచేసిన వ్యక్తిని ఉరితీయడానికి మీనమేషాలు లెక్కబెడుతున్నాం. ముంబయి మహాఘోరానికి కారణమైనవా

డిని చికెన్ బిరియానీలతో మేపుతున్నాం. కౌటిల్యా! ఇదీ మా పాలకుల రీతి, దండనీతి!

*కార్పొరేట్ భారతంలో...*

మార్కెట్లో బోలెడన్ని మేనేజ్‌మెంట్ గ్రంథాలున్నాయి. వాటిలో చాలావరకు పాశ్చాత్య రచనలే. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అక్కడి మనస్తత్వాలకు సరిపడేలా రాసుకున్నవే. కానీ మన పరిస్థితులు వేరు. మన సమాజం వేరు. భారతీయ కార్పొరేట్ రంగానికి అనువైన మేనేజ్‌మెంట్ గ్రంథాలు ఏవీ? ఆ శోధనలోనే నిపుణుల దృష్టి అర్థశాస్త్రం మీద పడింది. వ్యాపార ప్రపంచం కౌటిల్యుని సూత్రాలను కళ్లకద్దుకుంది. అందులోనూ యుద్ధతంత్ర సూత్రాలు... కార్పొరేట్ వ్యూహాలకు అతికినట్టు సరిపోతాయి. అక్కడ సరిహద్దుల పోరు. ఇక్కడ మార్కెట్ విస్తరణ పోరాటం. అక్కడ శత్రువు...పొరుగుదేశం పాలకుడో, విదేశీ దండయాత్రికుడో! ఇక్కడ శత్రువు...మరో కార్పొరేట్ సంస్థ, లేదంటే ఇంకేదో బహుళజాతి సంస్థ. అక్కడ రాజు. ఇక్కడ మేనేజింగ్ డైరెక్టర్. అక్కడ మంత్రులు. ఇక్కడ మేనేజర్లు. అక్కడ సైన్యం. ఇక్కడ ఉద్యోగి బృందం. అక్కడ ప్రజలు. ఇక్కడ ఖాతాదారులు. అక్కడ రాజధాని. ఇక్కడ కార్పొరేట్ ఆఫీస్. సామ్రాజ్య వ్యాపారానికీ, వ్యాపార సామ్రాజ్యానికీ పెద్దగా తేడా ఏముంది?

ఎప్పుడు ఏపని చేస్తే విజయం సాధించగలమో కౌటిల్యుడు ప్రతీకాత్మకంగా చెప్పాడు, 'వేసవిలో అయితే ఏనుగును సులభంగా పట్టుకోవచ్చు' అంటూ. వేసవిలో నీటికొరత ఉంటుంది. ఏనుగు దాహం తీర్చుకోడానికి దట్టమైన అడవిని దాటి బయటికి వస్తుంది. ఈ ఒక్కసూత్రంలోనే మార్కెటింగ్ వ్యూహమంతా ఇమిడి ఉంది. ఖాతాదారుడి అవస రాల్నీ మార్కెట్ పరిస్థితుల్నీ బేరీజువేసి బరిలో దిగేవారే ఘనవిజయాలు సాధిస్తారు.

నిన్నమొన్నటిదాకా వ్యాపార సంస్థల వ్యూహాలన్నీ పైపై మెరుగుల పట్టణాల చుట్టే తిరిగాయి. అది తప్పని తెలిశాక దారిమార్చుకున్నాయి. ఇప్పుడు, బ్యాంకులూ బీమాకంపెనీలూ సౌందర్యసాధనాల తయారీ సంస్థలూ టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్లూ...ఒకటేమిటి భారతీయ వ్యాపార రంగమంతా పల్లెల మీదే దృష్టిపెడుతోంది. గ్రామీణ ప్రాంతాల శక్తినీ కొనుగోలుశక్తినీ చాణక్యుడు ఎప్పుడో గుర్తించాడు. 'అధికారమైనా సిరిసంపదలైనా పల్లెల నుంచే వస్తాయి' అని కచ్చి తంగా చెప్పాడు. మానవ వనరులకు సంబంధించి కూడా కౌటిల్యుడు సూచనలు చేశాడు. నియామకాలు, బదిలీలు, ప్రమోషన్లు, ప్రోత్సాహకాలు... హెచ్‌ఆర్ నిపుణులకు అవసరమైన సూత్రాలన్నీ అర్థశాస్త్రంలో ఉన్నాయి. ప్రతి విభాగా నికీ సమర్థుడైన నాయకుడిని నియమించాలట. కానీ ఎవరికీ శాశ్వత అధికారాలు ఇవ్వకూడదట. హద్దుల్లేని భద్రత ఉద్యోగిలో నిర్లిప్తతను పెంచుతుంది.

వికాసాన్ని నాలుగు దశలుగా వివరించాడు చాణక్యుడు. ముందు అనుకున్న లక్ష్యాన్ని సాధించడం. సాధించినదాన్ని నిలుపుకోవడం. నిలుపుకున్న దాన్ని విస్తరించడం, ఆ విస్తరణ నలుగురికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవడం. ఓ సంస్థను స్థాపించడంతో కార్పొరేట్ నాయకుడి బాధ్యత తీరిపోదు. బాలారిష్టాల్ని తట్టుకుని నిలబడాలి. ఆతర్వాత, మార్కెట్ వాటా విస్తరించుకోవాలి. నంబర్‌వన్‌గా ఎదగాలి. ఆ విజయంలో ఉద్యోగులకూ, సంపదలో సమాజానికీ వాటా ఇవ్వాలి!

ఏ మేనేజ్‌మెంట్ గ్రంథమైనా వ్యాపారం ఎలా నిర్వహించాలో చెబుతుంది. కానీ ఆ పాఠాలన్నీ పైపై పూతలే. లోతు తక్కువ. అర్థశాస్త్రం మాత్రం ఓ వ్యవస్థనెలా నిర్మించాలో నేర్పుతుంది. పునాదులతో సహా పటిష్ఠపరచడం ఎలాగో బోధిస్తుంది.



*శైలి బంగారం*

చాణక్యుడి శైలి సూటిగా ఉంటుంది. ఏ విషయమైనా ఇట్టే అర్థమైపోతుంది. నేరుగా మనసును తాకుతుంది. నిజానికి మనం 'పెద్దలు ఇలా అన్నారు' అనో, 'శాస్త్రాల్లో ఇలా రాశారు' అనో చెప్పుకునే సూక్తుల్లో చాలావరకు చాణక్యుడివే. 'విద్వాన్ సర్వత్రపూజ్యతే' అన్న మాట ఆయనదే. 'స్వగృహే పూజ్యతే మూర్ఖః స్వగ్రామే గ్రామపాలకః స్వదేశే పూజ్యతే రాజా-విద్వాన్ సర్వత్ర పూజ్యతే'...ఇదీ పూర్తి శ్లోకం. మూర్ఖుడిని మహా అయితే కుటుంబ సభ్యులు గౌరవిస్తారు, గ్రామాధికారిని ఆ వూరివాళ్లు మాత్రమే గౌరవిస్తారు. రాజుకు ఆ రాజ్య సరిహద్దు లోపల మాత్రమే మర్యాదలు దక్కుతాయి. పండితుడికైతే... ఎక్కడికెళ్లినా ఆదరణ ఉంటుంది. 'నాలెడ్జ్ ఈజ్ పవర్' అన్న సంగతి క్రీస్తుపూర్వమే గుర్తించాడా మహానుభావుడు. పిల్లల్ని పసితనంలో లాలించాలి, ఎదిగే వయసులో దండించాలి, ఎదిగాక స్నేహితుల్లా చూడాలి...అని సైకాలజిస్టులు చెబుతున్న సలహాని, చాణక్యుడు ఎప్పుడో సూత్రీకరించాడు... 'లాలయేత్ పంచవర్షాణి దశవర్షాణి తాడయేత్, ప్రాప్తేతు షోడశే వర్షే, పుత్రం మిత్రవదాచరేత్' అంటూ. 'అప్పిచ్చువాడు వైద్యుడు' సుమతీశతక పద్యానికి మూలం 'చాణక్యనీతి'లో ఉంది. ధనికః బ్రాహ్మణోరాజా- నదీ వైద్యస్తుపంచమః... అని ప్రారంభిస్తూ నివాసయోగ్యమైన గ్రామాన్ని నిర్వచించాడు.

ఓ పది ఏనుగుల్ని సంపాదించాలంటే, మన దగ్గర ఒక్క ఏనుగు ఉన్నా చాలని చెబుతాడు. ఏనుగు సంఘజీవి. ఒంటరిగా ఉండలేదు. ఏనుగుల గుంపు ఎక్కడుంటే అక్కడికి వెళ్తుంది. అప్పుడు, మిగిలినవాటినీ బంధించవచ్చు. సంపాదన కూడా అలాంటిదే. 'ముందు కొంత డబ్బు సంపాదించాలి. ఆ తర్వాత డబ్బే డబ్బును సృష్టిస్తుంది' అని నేటితరం ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు చెప్పే సలహాకు మూలాలు, మూడువేల ఏళ్లనాటి అర్థశాస్త్రంలో ఉన్నాయి. 'యథా రాజ-తథా ప్రజ', 'వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి', 'పాముకు పాలు పోసినా అది విషమే అవుతుంది'... ఈ నానుడులన్నీ చాణక్యుడివే.

ఉపమా కాళిదాసస్య...అంటారు కానీ, కౌటిల్యుడు కూడా తక్కువవాడేం కాదు. చిన్నచిన్న పోలికల్లోనే కొండంత అర్థాన్ని ఇమిడ్చాడు. వేయి ఆవుల మందలో ఉన్నా... లేగదూడ తన తల్లిని ఇట్టే గుర్తిస్తుంది. పరుగుపరుగున దగ్గరకు చేరుకుంటుంది. అలాగే, కర్మఫలాలు కూడా మనల్ని వెంటాడుతూ ఉంటాయట! ఆలోచనాశక్తి లేనివారి అధికారం... గుడ్డివాడి చేతిలోని అద్దంతో సమానమట! దురాశను సముద్రపు నీటితో పోలుస్తాడు. తాగినకొద్దీ దప్పిక పెరుగుతుందే కాని తగ్గదు. చివరికి కడుపుబ్బి చావాల్సిందే.



నిత్యజీవితంలో పనికొచ్చే ఎన్నో ధర్మ సూక్ష్మాల్ని వివరించాడు చాణక్యుడు. 'ఎవరైనా నీకు ఖరీదైన బహుమతి ఇస్తున్నారంటే, ఏదో ఆశిస్తున్నారనే అర్థం. జాగ్రత్త!' అని హెచ్చరిస్తాడు. అతిప్రసంగ దోషముత్పాదయతి ...అనవసరమైన మాటలు చేటు చేస్తాయి! ముందు క్రోధాన్ని గెలువు, ఆతర్వాత ప్రపంచాన్ని గెలవడం పెద్ద సంగతేం కాదు... సర్వం జయతి అక్రోధః! 'పెద్దల్ని కలవడానికి వెళ్తున్నప్పుడు ఖాళీచేతులతో వెళ్లొద్దు. పండో పత్రో తీసుకెళ్లు' అని మంచి చెబుతాడు. అతిలాభః పుత్రలాభః...పిల్లల్ని పెంచి పెద్దచేశాక వాళ్లు ప్రయోజకులైతే అంతకుమించిన లాభం లేదు! అడ్డమైన గడ్డీతిని... నాలుగురాళ్లు వెనకేద్దామని అనుకోవడం మూర్ఖత్వం! 'రోజూ రాత్రి పడుకునే ముందు... ఈ రోజు నేనేం చేశాను. ఏం సాధించాను' అని అవలోకనం చేసుకోవాలట.. నిశాంతే కార్యం చింతయేత్! ఒకటా రెండా...వేలకొద్ది నిత్యసత్యాలున్నాయి చాణక్యుడి రచనల్లో. వాటిలో ఒక్కటి ఆచరించినా జీవితం సార్థకం అయినట్టే. ఆ వ్యక్తి ఇంటిపెద్ద అయితే, కుటుంబం బాగుపడుతుంది. నాయకుడైతే దేశం బాగుపడుతుంది.

కృతజ్ఞతలు...చాణక్యా!

## చాణక్య నీతి

వేల సంవత్సరాల క్రితం చాణక్యుడు చెప్పిన మాటలు ఆధునిక సమాజానికీ అతికినట్టు సరిపోతాయి. మచ్చుకు కొన్ని...

### వేయిమైళ్ల ప్రయాణమైనా...

ఒక్కో నీటి చుక్కనూ ఒడిసిపట్టుకుంటే బిందె నిండుతుంది. ఒక్కో పాఠాన్నీ తలకెక్కించుకుంటే చదువు అబ్బుతుంది. ఒక్కో పైసా పొదుపు చేసుకుంటే సిరిసంపదలు సమకూరతాయి. ఒక్కో మంచిపనీ చేసుకుంటూ పోతే... ధర్మాత్ముడు అనిపించుకుంటాం.

### దేనికి, ఎంతమంది?

తపస్సు...ఒంటరిగా చేయాలి. చదువు... ఇద్దరు కలిసి చదువుకోవాలి. సంగీతం నేర్చుకోడానికి ముగ్గురైతే సరిపోతారు. కొత్తప్రదేశానికి నలుగురితో కలిసి వెళ్లాలి. సేద్యానికి ఐదుగురు ఉండాలి. యుద్ధానికి వేలమందితో బయల్దేరాలి.

### మాటే మంత్రం

ప్రియవాదినో న శత్రుః... మాటే మానవ సంబంధాలకు మూలం. మాటే స్నేహితుల్ని సంపాదించి పెడుతుంది. శత్రువుల్ని తయారుచేస్తుంది. నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడే ధన్యుడు. అలాంటి వ్యక్తికి శత్రువులే ఉండరు. అంతిమ విజేత అతనే!

### జనాగ్రహం

ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత మొదలైతే అది అశాంతికి దారితీస్తుంది. ఆ పరిస్థితి రాకుండా... పాలకులు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి. ఉపాధి అవకాశాలు సృష్టించాలి. ప్రజలకు వ్యవస్థ మీద నమ్మకం కలిగించాలి.

### మానవ సంబంధాలు

మూర్ఖులతో శత్రుత్వం మరింత మూర్ఖత్వం. మిత్రులతో శత్రుత్వం చాలా హానికరం. గురువులతో శత్రుత్వం పెంచుకుంటే జ్ఞానాన్ని కాదనుకున్నట్టే. అంటే, అందరితో స్నేహంగా ఉండాలని అర్థం.

### స్నేహితుడు

నువ్వు సగర్వంగా రాజాస్థానానికి బయల్దేరుతున్నప్పుడే కాదు... విషాదంతో శ్మశానానికి వెళ్తున్నప్పుడు కూడా నీ వెంట నడిచేవాడే నిజమైన స్నేహితుడు.

### సంపాదన

కుటుంబానికి, బంధువులకు, అతిథులకు, నిరుపేదలకు, కష్టాలలో ఉన్నవారికి భోజనం పెట్టాక...మిగిలింది మనం తినాలి. అలా తినే అన్నం అమృతంతో సమానం.

### అనారోగ్యం

అనారోగ్యం శత్రువుకంటే ప్రమాదకరమైంది. అదనుచూసి దెబ్బకొడుతుంది. అజీర్ణే భోజనం దుఃఖం...మితాహారమే అన్నివేళలా మంచిది.

### అలంకరణ

విభావానురూపం ఆభరణం...మనం వేసుకునే బట్టలు మన ఆర్థిక పరిస్థితికి తగినట్టే ఉండాలి. ఆడంబరాలు పనికి రావు. వయోనురూపో వేషః... వయసును బట్టి కూడా అలంకరణ మారుతుంది.

### ప్రాణులే పాఠాలు

సింహం వేటాడిన ఆహారాన్నే తింటుంది. ఎంగిలి మెతుకులకు ఆశపడదు. కొంగ అవసరమైనంత మేరకే వేటాడుతుంది. దురాశకు పోదు. కోడి తెల్లవారుజామునే మేల్కొంటుంది. బద్ధకమంటే గిట్టదు. శునకానికి స్వామి భక్తిలో తిరుగులేదు. గాడిద ఓపికకి దండం పెట్టాలి. కాకి తన గురించి మాత్రమే ఆలోచించదు. 'కావుకావు' మంటూ తోటి కాకులకు కూడా ఆహారాన్ని వెతికి పెడుతుంది. ఇలా జీవకోటిలోని ప్రతి ప్రాణీ మనకో పాఠం నేర్పుతుంది.